

# పయనించే ఓ చిలుకా

ఎస్. ఘటికాచల రావు

**తెల్లవారక ముందే పక్షుల కిలకిలా రావాలు ప్రారంభమయ్యాయి. దాంతో వెంటనే మెలకువ వచ్చింది.**
**ఒక్క ఉదుటున పక్కమీది నుంచి లేచి రెండంగల్లో స్నానాల గది చేరుకుని మూడేనిముషాల్లో పళ్లు తోముకుని నాలుగు గుక్కల్లో అమ్మ ఇచ్చిన పాలు గటగటా తాగేసి ఐదో నిమిషానికి డాబా మీదికి చేరుకున్నాడు ఆరేళ్ల ఆ చిన్నారి.**
**పెరట్లో డాబాకు ఆనుకుని ఉన్న మామిడి చెట్టు మీదే అతని దృష్టి. రోజూ ఉదయాన్నే అలా అక్కడికి వచ్చి ఆ చెట్టు మీదనున్న ఆ పక్షుల గూడును చూడడం అతనికి అలవాటు. ఆ గూటిలో కొన్ని చిన్న చిన్న పక్షి పిల్లలు ఉన్నాయి. పెద్ద పక్షులు ఉదయాన్నే ఎక్కడికో వెళ్లి ఆహారం తీసుకు వచ్చి ఆ పిల్లల నోట్లో పెట్టడం చూస్తుంటే అతనికి వాళ్లమ్మ తినిపించే గోరు ముద్దలే గుర్తుకు వస్తున్నాయి. ఆ సమయంలో అతని కళ్లల్లో ఏదో తెలియని ఆనందం, మనసు కేరింతలు కొడుతూంది. చిన్నగా చప్పట్లు కొడతాడు.**

ఒక్కోసారి నోట్లో పెట్టేటప్పుడు ఆహారం కింద పడిపోతే, 'ఏయ్, కింద పడిపోయింది, తీసుకో' అంటాడు. తన భాష వాటికి అర్థమౌతుందేమో నన్న ఉద్దేశ్యంతో.

ఆ మరుక్షణమే పెద్ద పక్షి సర్రున కిందికి దూసుకెళ్లి ఆహారాన్ని ముక్కున కరుచుకొని మళ్లీ వచ్చి పిల్ల పక్షులకు తినిపిస్తుంది. ఆ పక్షి తన మాట అర్థం చేసుకుని అదే ప్రకారం నడుచుకున్నందుకు అతని చిన్నారి మనసులో సంబరం అంబరాన్నంటుతుంది. దాదాపుగా రోజూ ఇదే తంతు. రోజులు గడిచే కొద్దీ ఆ పక్షి పిల్లలు పెరిగి పెద్దవై వాటిల్లో కొన్ని ఎగిరేందుకు కూడా ప్రయత్నిస్తున్నాయి.

ఆ పిల్లవాడి ఆనందానికి అవధుల్లేవు. పక్షులు తన కళ్ల ముందుగానే పెరిగి పెద్దవై ఎగరడం అలవాటు చేసుకుంటుంటే తానే వాటికి అవన్నీ నేర్పిస్తున్న అనుభూతికి లోనౌతున్నాడు.

ఆ గూటిలో మొత్తం ఏడు పక్షి పిల్లలున్నాయి. వాటికి తోడు పెద్ద పక్షులు. అమ్మా, నాన్నా, పిల్లలు భలే బాగుంది అనుకునేవాడు. రోజూ క్రమం తప్పకుండా లెక్కపెట్టేవాడు.

ఎగరడానికి అలవాటు చేసుకుంటున్న పిల్ల పక్షులు కొంత దూరం వరకూ ఎగిరి వెళ్లి మళ్లీ గూటికి చేరుకోవడం భలే సరదాగా ఉంది. ప్రకృతి నుంచి మనుషులు నేర్చుకోవలసిన పాఠాలు ఎన్నో

ఉన్నాయి. పక్షులు ప్రకృతిలో ఒక భాగం మాత్రమే. ఐతే అనంతకోటి జంతు జాలాలలో కేవలం మనిషికి మాత్రమే విచక్షణా జ్ఞానం ప్రసాదించాడు భగవంతుడు.

కొన్నాళ్ల తరువాత హఠాత్తుగా ఒకరోజు అందులో కొన్ని పక్షి పిల్లలు కనపడలేదు. ఆ పిల్లవాడు ఆందోళన చెందాడు. ఆరోజు సాయంత్రం వరకూ అవి మళ్లీ తిరిగి వస్తాయేమోనన్న ఆశతో గంట గంటకూ వెళ్లి ఆ గూటిని చూడసాగాడు. ఐతే వాడికి నిరాశే మిగిలింది. ఉన్న ఏడు పిల్లల్లో నాలుగు పిల్లలు తిరిగి రానే లేదు.

ఆ పిల్లవాడు బాగా దిగులు చెందాడు.

మరుసటిరోజు సాయంత్రం తండ్రిని అడిగాడు 'ఆ పిల్లలిక రావా?' అని.

''రెక్కలొచ్చిన పక్షులు ఉండమన్నా ఒకచోట ఉండవురా. తమ జీవితాలు తామే నిర్ణయించుకుంటాయి. తమ తిండి గింజలు తామే సంపాదించుకుంటాయి'' అన్నాడు అనునయింపుగా.

''మరి వాళ్ల అమ్మానాన్న దగ్గరికి ఇక రానే రావా?''

''ఏమో చెప్పలేం. చాలా మట్టుకు ఇక తిరిగి రావు.''

''మరి వాళ్లమ్మా నాన్నలకు ఏడుపు రాదా?''

ఆ పిల్లవాడి ప్రశ్నకు తండ్రి జవాబు చెప్పలేకపోయాడు.

''చెప్పండి నాన్నా...''

''జంతువుల్లోనూ, పక్షుల్లోనూ ఇది సహజం బాబూ. పిల్లల్ని పెంచడం వరకే వాటి బాధ్యత. పెరిగి పెద్దవయ్యాక ఆ పిల్లలు తమ దారి తాము చూసుకుంటాయి.''

''మరి ఆ అమ్మానాన్నలకు చేతగాకపోతే వాటికి తిండి ఎవరు పెడతారు?''

ఆ ప్రశ్నకు కూడా అతని వద్ద జవాబు లేదు. అతనికి తెలిసినంత వరకూ అచేతనంగా ఉన్న పక్షులను తానెప్పుడూ చూడలేదు. అలాంటప్పుడు ఏం జవాబు చెప్పగలడు. మౌనం వహించడం తప్ప మరేమీ చెయ్యలేకపోయాడు.

మరో వారం గడిచిన తరువాత ఆ మిగిలిన పిల్లలు కూడా ఎగిరిపోయాయి.

ఆ పిల్లవాడు పూర్తిగా దిగాలు పడిపోయాడు. కొన్నాళ్ల వరకూ ఆ బాధను మర్చిపోలేకపోయాడు. ఆ తరువాత క్రమంగా ఆ విషయాన్ని మర్చిపోయాడు.

అలా చెప్పడం కన్నా అలవాటై పోయింది అంటే బాగుంటుందేమో.

ఐతే మరి కొన్నాళ్లకు ఆ పక్షి మళ్లీ గుడ్లు పెట్టి పిల్లలు పొదగడం గమనించాడు. అతనికి ఆశ్చర్యం, ఆనందం రెండూ కలిగాయి. అంతలోనే మళ్లీ దిగులు ఆవహించింది. 'ఈ పిల్లలు కూడా మునుపటి పిల్లల్లాగే పెరిగి పెద్దవై ఎగిరి పోతాయి. అంతే' అనుకున్నాడు మనసులో నిర్వేదంగా.

ఐనా మనసులో ఏదో ఒక మూల ఒక చిన్న ఆశ.

పరుగున వెళ్లి తండ్రిని అడిగాడు. ''నాన్నగారూ, ఈసారి వాటిని ఎగిరిపోకుండా చూసుకుందామా?''

పిల్లవాడి ఆశకు అతనికి ఏం చెప్పాలో తెలియలేదు.

''మనం ఆపినంత మాత్రాన అవి ఆగవు బాబూ. అదంతే'' అన్నాడు.

పిల్లవాడి మనసును మళ్ళీ దిగులు ఆవహించింది.

ఐతే ఆ పక్షులకు మాత్రం ఇంతకు మునుపు ఎదిగి ఎగిరిపోయిన పిల్లల గురించి దిగులు ఏమాత్రం ఉన్నట్లు కనిపించలేదు ఆ పిల్లవాడికి. పిల్లలను పెంచడమే తమ కర్తవ్యమన్నట్లుగా ఎప్పటిలాగే పిల్లలకు ఆహారం అందించడం వంటి దినసరి కార్యక్రమాల్లో మునిగిపోయాయి.

పిల్లవాడికి ఒక్క పక్క సంతోషంగా ఉన్నా మరో వైపున దిగులు అతన్ని వదలలేదు. పక్షి పిల్లలు వాటి తల్లిదండ్రులను వదిలి వెళ్లకుండా చూడ్డం ఎలా అన్నదే అతని ఆలోచన.

కాలక్రమేణా పిల్లవాడు పెరిగి పెద్దవాడయ్యాడు.

బుద్ధిమంతుడు, తెలివిగల వాడు కావడం వల్ల ఆ పిల్లవాడు పెద్ద చదువులు చదివి, ఆ చదువుకు తగిన విధంగా ఉన్న ఊళ్లోనే గొప్ప ఉద్యోగంతో మంచి స్థితిలో స్థిరపడ్డాడు. అంతే కాక కంపెనీ వాళ్లు ఆ అబ్బాయి తెలివితేటలు సామర్థ్యం చూసి విదేశాలకు వెళ్లే అవకాశం కల్పించారు. ఐతే ''ఏకఛత్రాధిపత్యం వహించి విదేశాల్లో ఉన్న కంపెనీ బ్రాండ్ బాధ్యతను ఐదేళ్లపాటు అక్కడే ఉండి చూసుకోవాలి'' అన్నదే ఒక షరతు.

యుక్తవయసుకు వచ్చిన ఆ పిల్లవాడికి విదేశాలకు వెళ్లే అవకాశం కలిగిందన్న వార్త అమితమైన సంతోషాన్నిచ్చింది. అంతకన్నా ముఖ్యమైన విషయం ఆ కంపెనీకి తానే అధిపతిగా చెలామణి అవ్వడం! ఆఘమేఘాల మీద ఇంటికి వచ్చి తల్లిదండ్రులకు విషయాన్ని వివరించాడు.

ఐతే ఆ సమయంలో తండ్రి మాత్రం ఆ నిర్ణయాన్ని హర్షించలేకపోయాడు.

''ఐదేళ్లపాటు నిన్ను వదిలి ఎలా ఉండాలిరా?'' అన్నాడు ఆ తండ్రి గద్గద స్వరంతో.

''అలాగంటే ఎలా నాన్నగారూ? ఇది నా టాలెంట్‌కు దొరికిన ప్రతిఫలం.''

''నిజమే. కాదనను. కానీ ఆ అవకాశమేదో ఇక్కడే ఇవ్వొచ్చుగా. ఇక్కడ బ్రాంచికే నిన్ను అధిపతిగా చేయొచ్చుగా.''


''అదెలా కుదురుతుంది? నా ఇష్టప్రకారం జరగడానికి నేనేమైనా ఆ కంపెనీ స్వంతదారునా? కేవలం ఒక ఉద్యోగిని. ఐనా ఒక యజమాని హోదా కల్పించి అక్కడికి పంపిస్తున్నారంటే అది ఎంత గొప్ప విషయం.''

''ఇప్పుడే నీకు పాతికేళ్లు. పెళ్లీడొచ్చింది. ఈ సమయంలో అక్కడికి వెళ్లిపోతే పెళ్లి వాయిదా పడిపోతుంది. అందులోనూ కంపెనీ ఛీఫ్‌గా వెళ్తున్నావు. ఏదైనా బాధ్యత నెత్తికెత్తుకుంటే ఈ ప్రపంచాన్నే మర్చిపోయే నైజం నీది. ఇక పెళ్లి గురించి ఆలోచించగలవా? ఏ వయసులో జరగాల్సిన ముచ్చట ఆ వయసులో జరగాలి.''

''పాతికేళ్లకే పెళ్ళేమిటి నాన్నా?''

''నువ్వామాట అంటావని నాకు తెలుసు. ఇప్పుడు పాతికేళ్లు. నువ్వు తిరిగొచ్చేసరికి ముప్పై. అదీగాక మాకుండేది నువ్వొక్కడివే. నువ్వక్కడికి వెళ్ళిపోతే ఇక్కడ బిక్కుబిక్కుమంటూ మేం మాత్రం ఎలా కాలక్షేపం చెయ్యగలం. నువ్వు పెళ్లి చేసుకుంటే కోడలు, మనవళ్లు మరవరాళ్ళతో కాలక్షేపం అవుతుంది. ఏమోరా, నాకేమీ తోచడం లేదు. నేనేమి చెప్పలేకున్నాను. నీ ఇష్టం. నీకేది మంచిదనిపిస్తే అది చెయ్. మీ అమ్మ ఏమంటుందో కనుక్కో'' అని మాత్రం అన్నాడా తండ్రి పెద్దగా నిట్టూరుస్తూ.

## కాలం వెలగని దీపం



నిద్రే,
అక్షరాలు లేని పదం.
తాకాలో, తడవాలో, తుడుచుకుపోవాలో
ఎంతకీ చెప్పదు తుషార విషాద స్వప్నం.
పదాల శూన్యం ఎల్లప్పుడూ తోడుండదు.
శూన్యాలిపై జ్ఞాపకం తోడురాదు.
మౌన వజ్రాలు నీ పెదాలు.
నిరీక్షణలో నీ మాటలే నాకొక మరోజన్మ.
గాలి పటానికి గాలి దూరం ఎంత.
ప్రేమ పటానికి మనసు దూరం ఎంత.
అనేక రేయింబవళ్ల కనుపాపలపై
ఆశతో ప్రయాణించే వర్షాన్నయ్యాను.
ఏ తీరాంతంలోనో
దీపంలోని తలుపుల్ని మూయాలి.
అప్పటివరకైనా, తలుపెయ్యకు.
తల వంపుల తలంపుల తలుపెయ్యకు.
అవే, నేల రెక్కలై, దేహభాగాలై,
రూపంలేని ఒంటరి మాటలై, అడ్డు పడ్తాయి.
తలుపెయ్యకు. తారట్లాడే కలలు
కాలాన్ని వొదిలి మరీ వొస్తాయి.
ఆకలి తీర్చే ధాన్యాన్నీ, ధ్యానాన్నీ
ఊక ఎగిరినట్టు తలుపెయ్యకు.
కన్నీళ్లని ఆపిన కనురెప్పల్ని మూసినట్టు
తలుపెయ్యకు.
జ్ఞాపకాల్ని శరీరంతో తోసినట్టు తలుపెయ్యకు.
తలుపుల నిశ్శబ్దాన్ని కలపకు.
గాలి నురుగులో
పదాల అద్దాల్లో
మెరుపుల మన్నులో
నింగి శ్వాసలో
నీ కోసమే తలుపులు తెరుచుకోవాలని
ద్వారాలే లేని దుఃఖకాంతినై అంకురించాలని.

-ఎం.ఎస్.నాయుడు

తండ్రి స్వరంలోని మార్దవానికి, బేలతనానికి కొడుకు కరిగిపోయాడు. 'తండ్రి పరిస్థితే ఇలా ఉంటే, ఇక తల్లి విషయం చెప్పనవసరం లేదు. కదిలిస్తే కళ్లనీళ్ళ పర్యంతమౌతుంది. ఆలోచిస్తే తల్లిదండ్రులను వదిలి వెళ్లడానికి తను కూడా సుముఖంగా లేడు. పుట్టినప్పటి నుంచీ ఏనాడూ కనీసం ఒక రోజు కూడా వాళ్లకు దూరంగా లేడు. కాలేజి చదివినా ఇంటి నుండే వెళ్లివచ్చాడు. హాస్టల్ మాటే లేదు. అలాంటిది ఇప్పుడు వదిలి వెళ్లడమంటే అతనిక్కూడా మనసంతా ఏదోగా ఉంది. కానీ ఏమీ చెయ్యలేని పరిస్థితి. వెళ్లే తీరాలన్నది కంపెనీ నిబంధన. అలా కాదనుకుంటే ఆ ఉద్యోగం వదులుకుని వేరే ఏదైనా చూసుకోవాలి' అనేక విధాలైన ఆలోచనలతో సతమతమైపోసాగాడు ఆ కొడుకు.

తండ్రీ కొడుకుల సంభాషణను వంటింట్లో నుంచే వింటున్న ఆ తల్లి ఆలోచనలు కొడుకు ఆలోచనలతో సరితూగాయి. కొడుకును వదిలి రోజులు కాదు సంవత్సరాలు ఉండాలంటే కన్నపేగు జీర్ణించుకోలేకపోయింది. వారించి తీరాలన్నదే ఆమె నిర్ణయం. ఐతే అది కొడుకు జీవితం. భవిష్యత్తుకు సంబంధించిన విషయం, చదువు సంధ్యలు కలిగిన కొడుకు, లోకజ్ఞానం కలిగిన భర్త కలిసి ఏ నిర్ణయం తీసుకున్నా దానికి రాజీ పడడమే మంచిదన్న నిర్ణయానికి వచ్చి మనసును దృఢపరుచుకోసాగింది ఆ తల్లి ఆక్షణం నుంచే.

నిర్ణయం తెలియజేయడానికి రెండు వారాల గడువు ఇచ్చింది కంపెనీ. అతని నిర్ణయం తెలిపిన తరువాత అతని ప్రయాణానికి కావలసిన మిగతా ఏర్పాట్లు చెయ్యాలి కంపెనీ కార్యవర్గం.

రెండు వారాల గడువు తరువాత ఎట్టకేలకు ఆ కొడుకు తన నిర్ణయాన్ని తెలిపాడు.

విదేశాలకు వెళ్లడం కుదరదని!

అతని నిర్ణయం కంపెనీ యాజమాన్యానికి కొద్దిగా బాధ కలిగించింది. కంపెనీ ఛైర్మెన్ స్వయంగా పిలిచి అతనితో మాట్లాడి నచ్చజెప్పే ప్రయత్నం చేశాడు.

''అవకాశాలు అందరికీ రావు. వచ్చిన అవకాశాన్ని కాదనుకోవడం మంచిది కాదు. ఎంతో భవిష్యత్తున్న కుర్రాడివి. సెంటిమెంట్లతో భవిష్యత్తును కాదనుకోకు'' అంటూ ఎన్నో విధాల చెప్పాడు. వయసులో తండ్రిని మించిన ఆ పెద్దమనిషి ఎన్ని చెప్పినా ఆ అబ్బాయి తన నిర్ణయాన్ని మార్చుకోలేదు.

''తాను అమెరికాలో ఉండి సంపాదించడం తన తల్లిదండ్రులకు గర్వకారణం కావచ్చు. తన భవిష్యత్తుకు బంగారు బాట కావచ్చు. కానీ జీవితం అంటే కేవలం సంపాదన కాదు. దగ్గరుండి తన వాళ్లను సుఖపెట్టలేని సంపాదన ఎందుకు?'' అన్న వేదాంత ధోరణి మనసును ఆవహించగా, ఛైర్మన్ మాటలకు తలొగ్గలేదు.

అతని నిర్ణయానికి ఛైర్మెన్ చాలా నిరాశ చెందాడు. ఐనా అతని తెలివితేటల కారణంగా కంపెనీలోనే ఉండనిచ్చాడు. అబ్బాయికి తాత్కాలిక ఉపశమనం. అతని తల్లిదండ్రులకు అపరిమితానందం. అబ్బాయికి తల్లిదండ్రులను సంతృప్తి పరచానన్న ఆనందం. తల్లిదండ్రులకు అబ్బాయి తమ మాటను కాదనలేదన్న సంతోషం. వెరసి ఆ కుటుంబంలో సుఖసంతోషాలు వెల్లివిరిశాయి.

ఆ మరుసటి సంవత్సరమే ఆ అబ్బాయికి వివాహం జరిగింది.

ప్రపంచమంతా ఆర్థిక మాంద్యంతో సతమతమౌతోంది. దిగ్గజాలనుకునే కంపెనీలే మూతబడుతున్నాయి. ఎప్పుడు ఎవరి ఉద్యోగం ఊడుతుందో తెలియని పరిస్థితి. జీతాలు పెరిగే ప్రసక్తి లేదు సరి కదా, ఉన్న జీతాల్లో కోతలు, పని సామర్థ్యం లేకుంటే ఉద్వాసనలు కంపెనీల్లో మామూలైపోయాయి. ఈ క్రమంలో ఆ అబ్బాయి తండ్రయ్యాడు. అతని తండ్రికి తాత హోదా కలిగింది.

అత్యంత సమర్థవంతుడు కావడం వల్ల జీతం కోత నుంచి తప్పించుకున్నాడు. కానీ ద్రవ్యోల్బణం, ధరల పెరుగుదల నుంచి తప్పించుకోలేకపోయాడు. వచ్చే జీతం జీవనానికి సరిపోతోంది.




జీవన గమనంలో ఇబ్బంది లేదు. గానీ జీవనస్థాయిలో ఎదుగుదల లేదు. పుట్టిన పిల్లవాడి భవిష్యత్తు కోసం ఏదైనా చేద్దామనుకుంటే ఆర్థిక ఇబ్బందుల వల్ల కుదరని పరిస్థితి కలిగింది. మూడేళ్ళ తరువాత మొదటిసారిగా విదేశాలకు వెళ్లకుండా తప్పు చేశానేమోనన్న భావన అతని మదిలో కలిగింది. కానీ ప్రస్తుతానికి చేయగలిగిందేమీ లేదు. అంతలోనే తనను తాను సమర్థించుకున్నాడు. తను తప్పేమీ చేయలేదని తను అనుభవించిన సుఖ సంతోషాల ముందు సంపాదన పెద్దదేమీ కాదని తృప్తి చెందాడు.

పిల్లవాడు తన బుడిబుడి నడకలతో ముద్దులు కురిపిస్తున్నాడు.

ముద్దు ముద్దు మాటలతో మురిపిస్తున్నాడు.

చిలిపి చేష్టలతో మైమరిపిస్తున్నాడు.

మరికొంత కాలం గడిచింది. పిల్లవాడికి నాలుగేళ్ళ ప్రాయం.

ఒకరోజు సాయంత్రం ఇంటి వెనక పెరట్లో ఉన్న మామిడి చెట్టు కింద కుర్చీ వేసుకుని కూర్చుని ఉన్నాడు అబ్బాయి. పిల్లవాడు అక్కడే నేల మీద ఆడుకుంటున్నాడు.

కాస్సేపటికి పక్షుల కిలకిలరావాలు పిల్లవాడి దృష్టిని మరల్చాయి. అబ్బాయి దృష్టిని కూడా మరల్చాయి.

అతనికి తన చిన్నతనం గుర్తుకు వచ్చింది. అమాయకత్వం నిండిన చిన్నతనం, బాధ్యతలెరుగని చిన్నతనం, చిలిపితనం నిండిన చిన్నతనం, ఆసక్తి కలిగిన చిన్నతనం.

చాలా రోజుల వరకూ ఆ చెట్టు మీద ఉండే పక్షులను గమనిస్తూ వచ్చాడు. దాదాపుగా తను ఏడో తరగతో ఎనిమిదో తరగతో వచ్చేంత వరకూ గమనిస్తూ వచ్చాడు. ఆ తరువాత చదువు ధ్యాసలో పడి దాని వైపు దృష్టి మరల్చలేదు.

చదువు తరువాత ఉద్యోగం, ఆ తరువాత పెళ్ళి. మళ్ళీ ఇంత కాలానికి ఆ పక్షుల జంటను గమనిస్తున్నాడు. దాదాపుగా ఇరవై ఏళ్ల గడిచాయి. అదే జాతికి చెందిన పక్షులే ఉన్నాయి కానీ, కచ్చితంగా అవే పక్షులు మాత్రం అయి ఉండవు.

అతనిలో ఆసక్తి చోటు చేసుకుంది.

నాలుగైదు పక్షి పిల్లలు ఉన్నాయి. చిన్నతనంలో తను చూసినట్టే పెద్ద పక్షులు పిల్ల పక్షులకు ఆహారాన్ని అందిస్తున్నాయి. పిల్ల పక్షులు కోలాహలంగా అరుస్తూ ఆహారాన్ని అందుకోవడానికి పోటీ పడుతున్నాయి.

అది చూసి అతను తన చిన్నతనం తిరిగొచ్చినంత సంబరపడ్డాడు. తాత్కాలికంగా ప్రస్తుతం ఉన్న కష్టాలను ఆర్థిక ఇబ్బందులను మర్చిపోయాడు.

పిల్లవాడు వచ్చి, ''నాన్నా, నాకు అవి కావాలి. వాటితో ఆడుకుంటాను'' అన్నాడు వచ్చీ రాని మాటలతో ముద్దుముద్దుగా.


చిన్నతనంలో తను వాటిని చూశాడు గానీ, ఏనాడూ వాటిని తెచ్చివ్వమని తండ్రిని అడగలేదు. కాలంతో బాటుగా పిల్లల మనస్తత్వంలో ఆలోచనాసరళిలో కూడా మార్పు వస్తుందేమో!

తన చిన్నతనంలో వీధిలో గోళీలు, బిళ్ళంగోడు లాంటి ఆటలు ఆడే వాళ్లు. మరిప్పుడో....ఈ నాలుగేళ్ళ బుడతడు కంప్యూటర్ గేములే ఆడతాడు. ఆ గోళీకాయలు, బిళ్లంగోడు ఆటలు అసలే తెలియవు.

''అవి మన చేతికి దొరకవు కన్నా. అదీ గాక వాటిని మనం తెచ్చేస్తే వాళ్లమ్మ వచ్చి మనల్ని తంతుంది'' అన్నాడు బుజ్జగిస్తున్నట్టుగా.

వాడి ముఖం చిన్నబోయింది. ఆ పక్షి పిల్లలు ఆడుకోవడానికి బాగున్నాయి. కానీ తండ్రేమో దొరకవంటున్నాడు. మరి చేసేది లేక వాటి అరుపులను అవి ఆహారం తీసుకునే విధానాన్ని గమనిస్తూ అలా కూర్చుండిపోయాడు.

కొన్నాళ్ళకు ఎప్పటిలాగే పక్షి పిల్లలు ఎగిరిపోయాయి.




అది చూసిన పిల్లవాడు నానా హంగామా చేశాడు. ఆ పిల్లలు తనకు కావాలని పట్టుబట్టాడు. ఎంతగా అనునయించినా, సముదాయించినా తన హఠం మానలేదు.

''చూడు కన్నా, అవి ఇప్పుడు పెరిగి పెద్దవయ్యాయి. ఇప్పుడు చూడు నిన్ను ఎత్తుకోకుండా నువ్వే నడుచుకుంటూ అన్ని చోట్లకూ వెళ్తావు కదా. అలాగే అవి కూడా ఎగరడం నేర్చుకుని తమకు కావలసిన చోటికి వెళ్ళి తమకు కావలసిన ఆహారాన్ని తింటాయి. అందువల్ల నువ్వు ఇలా మారాం చెయ్యకూడదు. చూడు వాళ్లమ్మే ఆ పిల్లలను ఏమీ అనలేదు'' అన్నాడు.

ఆ మాటలు చెప్తున్నప్పుడు ఆ తండ్రి మనసులో ఏవో ఆలోచనలు రేకెత్తాయి. చిన్నగా ప్రారంభమైన ఆలోచనలు ఉత్తుంగ తరంగంలా లేచాయి.

''నిజమే, పక్షి పిల్లలు రెక్కలొచ్చాక తమ జీవనాధారాన్ని తాము వెదుక్కున్నాయి. స్వతంత్ర జీవనాన్ని కోరుకున్నాయి. వెళ్లిపోయాయి అంతే. అంత మాత్రాన వాటికి అభిమానం, ఆప్యాయతలు లేనట్టు కాదే!''

ఆ పక్షి పిల్లల జీవితాన్ని తన జీవితంతో పోల్చుకున్నాడు.

''వాటి లాగా తను కూడా విదేశాలకు ఎగిరిపోయి ఉంటే, ఈ నాడు పరిస్థితులు ఎలా ఉండేవో? ఆర్థిక మాంద్యం వల్ల ఇబ్బంది పడేవాడా? మంచి సంపాదనతో స్థాయిని పెంచుకుని ఉండేవాడా? ఎటూ ఆలోచించలేని పరిస్థితి! ఐతే ఆరోజు మనసులోనే తనకు తానుగా తల్లిదండ్రులతో ఉండాలని నిర్ణయించుకున్నాడు గానీ, తల్లిదండ్రుల బలవంతం మీద ఉండిపోలేదు. కన్నవాళ్ల ప్రేమ, అనురాగం, ఆప్యాయతలు తనకు కావాలని కోరుకున్నాడు. చిన్నప్పట్నుంచీ పెంచుకున్న మమతానురాగాలు వదులుకోలేకపోయాడు. అంతేగానీ తన నిర్ణయంలో తల్లిదండ్రుల ప్రోద్బలమేమీ లేదు. తల్లిదండ్రుల కేవలం ఒకసారి మాత్రమే తమ మనసులోని మాటలు తన ముందుంచారు. అది పెంచిన మమకారం వల్ల కలిగిన బలహీనత కావచ్చు. దానివల్ల తన మనసులో ప్రేమపాశాన్ని మరింతంగా పెంచారు. కానీ ఇక్కడే ఉండిపోవాలన్న నిర్ణయం మాత్రం పూర్తిగా తనదే. తన పిల్లవాడి విషయంలో కూడా నిర్ణయం పూర్తిగా అతనిదై ఉండాలి. అతని మాటకు ఆలోచనలకు అడ్డు తగలకూడదు. పిల్లల ఆలోచనలు పెడదారి పట్టేట్టుంటే అడ్డుకోవాలి గానీ అభ్యున్నతికి మాత్రం మమకారంతోనూ పాశంతోనూ అడ్డుకట్ట వేయకూడదు.''

అలా మనసులో స్థిరమైన నిర్ణయం తీసుకుని చెట్టుకింద నుంచి తృప్తిగా లేచాడు.

ఇప్పుడు అతనికి పక్షి పిల్లలు ఎగిరిపోయినందుకు బాధ లేదు.

*


ఎస్.ఘటికాచల రావు

09003141474